## 23 వరకు డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలి : ఎంజీయూ సీఈఓ

రామగిరి, సెప్టెంబర్ 13 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో డిగ్రీ ఆరో సెమిస్టర్‌లో సబ్జెక్టులు ఫెయిల్ అయిన విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజును ఈ నెల 23లోగా చెల్లించాలని, ఈ నెల 30న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి పేపర్‌కు రూ. 1000 ఫీజు ఉంటుందని, విద్యార్థులు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి చెల్లించాలన్నారు. ఆరో సెమిస్టర్‌లో మాత్రమే సబ్జెక్టు ఫెయిల్ అయి ఉండాలని, ఇతర సెమిస్టర్‌లో బ్యాక్‌లాగ్ ఉంటే ఇన్‌స్టంట్ పరీక్ష రాయడానికి అవకాశం లేదని తెలిపారు.

## ఆర్టీసీలో పలువురికి పదోన్నతులు

నల్లగొండ సిటీ, సెప్టెంబర్13 : నల్లగొండ ఆర్టీసీ రీజియన్ పరిధిలో పని చేస్తున్న పలువురికి పదోన్నతి కల్పించడంతోపాటు బదిలీ చేస్తూ శుక్రవారం ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రీజియన్ పరిధిలో ఉన్న కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్ విభాగంలో పని చేస్తున్న 42మందికి ఏడీసీలుగా పదోన్నతి కల్పించారు. ఏడీసీలుగా పనిచేస్తున్న 14మందికి డిపో కలెక్టర్లుగా పదోన్నతి ఇచ్చారు. మరో 10మంది ఏడీసీలను బదిలీ చేశారు.



నాగార్జున సాగర్ జల విద్యుత్ ఉత్పాదన కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి వివరాలను తెలుసుకుంటున్న జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్

## పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలి

**జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్**

నందికొండ, సెప్టెంబర్ 13 : నీరు పుష్కలంగా ఉన్నందున్న వీలైనంత వరకు పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని నిరాంటకంగా చేపట్టాలని జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్ అన్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. జల విద్యుత్ కేంద్రంలో నీటితో చేపడుతున్న విద్యుత్ ఉత్పత్తి విధానం, నీటి వినియోగం, ఉత్పత్తి అవుతున్న విద్యుత్ అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తిలో ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, విద్యుత్ ఉత్పత్తి చేపట్టడంలో ఎవరూ అలసత్వ వహించరాదని తెలిపారు. నిరంతర విద్యుత్ ఉత్పత్తికి తగిన విధంగా విద్యుత్ ఉత్పాదక కేంద్రంలో మరమ్మతుల పనులను ఎప్పటికప్పుడు చేయాలని, విద్యుత్ ఉత్పత్తికి టర్బన్లను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. టర్బన్‌ల మరమ్మతుల పనులను వెంటనే చేపట్టి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని చేయాలని అధికారులకు సూచించారు. అంతకుముందు జలవిద్యుత్ అవరణలో మొక్కలను నాటారు. ఆయనతోపాటు హైడల్ డైరెక్టర్ వెంకట్‌రాజన్, జెన్‌కో సీఈ మంగేశ్‌కుమార్, ఎస్ఈలు రఘురామ్, రామకృష్ణారెడ్డి, డీఈలు ప్రసన్న కుమార్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.



తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# నిర్బంధకాండ

## ఉమ్మడి జిల్లా అంతటా బీఆర్ఎస్ శ్రేణుల ముందస్తు అరెస్టులు

- ఎక్కడికక్కడ నిర్బంధం.. పోలీస్ స్టేషన్లకు తరలింపు
- పోలీస్ స్టేషన్లలోనే బీఆర్ఎస్ శ్రేణుల నిరసన
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- అప్రజాస్వామికమంటూ మండిపాటు
- నాడు, నేడు అణచివేతల్లో మారని కాంగ్రెస్ నైజం

సూర్యాపేట, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ)/నల్లగొండ : బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు హైదరాబాద్‌కు వెళ్లకుండా ఉండేందుకు ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. దాదాపు అన్ని మండలాల్లో వందలాది మందిని అరెస్ట్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్లలోనే నిర్బంధించారు. నల్లగొండ జిల్లాలో నల్లగొండ, చందంపేట, దామరచర్ల, కట్టంగూర్, మాడ్గులపల్లి, శాలిగౌరారం, నిడమనూరు, త్రిపురారం, హాలియా.. సూర్యాపేట జిల్లాలో నేరేడుచర్ల, తిరుమలగిరి, మేళ్లచెరువు, కోదాడ, చిలుకూరు, నడిగూడెం, పాలకవీడు, గరిడేపల్లి, చింతలపాలెం, మోతె మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ జిల్లా నాయకులతోపాటు మండల, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉన్నారు. ఈ అక్రమ అరెస్టులను బీఆర్ఎస్‌తోపాటు అన్ని వర్గాలు తీవ్రంగా ఖండించాయి. పోలీసుల తీరుకు నిరసనగా స్టేషన్లలోనే బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. తెలంగాణ ఉద్యమ సమయంలోనైనా... నేడు ప్రజా సమస్య పరిష్కారంలోనైనా నిరసనలు తెలిపేందుకు బీఆర్ఎస్ కార్యాచరణ రూపొందిస్తే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అణచివేతల్లో తన నైజం మార్చుకోవడం లేదని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నారు. దాడులకు పాల్పడడం, నిరసనలు తెలిపితే ఉక్కుపాదంతో అణచివేయాలనే కుట్రలకు దిగడం ఆ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## ఇదేం ప్రజా పాలన?

- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేయించిందే..
- ఎక్స్ వేదికగా స్పందించిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేయించినదేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడి పట్ల శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఇదేం ప్రజాపాలన, ఇదేం ఇందిరమ్మ రాజ్యం? పట్టపగలు హైదరాబాద్ నడిబొడ్డున ఒక ఎమ్మెల్యేపై జరిగిన దాడికి ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ బాధ్యత వహించాలి. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి పూర్తి భద్రత కల్పించాలని డీజీపీని డిమాండ్ చేస్తున్నాం. దాడి చేసిన వారిని అరెస్టు చేయాల్సింది పోయి శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం ఎంత వరకు న్యాయం. డీజీపీ గారూ. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న వికృత రాజకీయ క్రీడలో తెలంగాణ పోలీసులు కూడా భాగమవడం దారుణం. అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు మిగతా ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేయాలి. గురువారం హైదరాబాద్‌లో ఒక ప్రజా ప్రతినిధి ఇంటి మీద పోలీసుల సమక్షంలో దాడి జరుగుతుంటే నియంత్రించకుండా రాత్రి నుంచి గ్రామాల్లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేస్తున్నారు. ఇది ప్రజా పాలన కాదు నియంత పాలన. పోలీసుల తోపులాటలో భుజం గాయంలో హాస్పిటల్‌కి వెళ్తున్న హరీశ్‌రావును హౌస్ అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే' అని ట్వీట్ చేశారు.




మాడ్గులపల్లి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి తీసుకొచ్చిన పోలీసులు



మోతె పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

## కృషి ఉంటేనే లక్ష్య సాధన సులభం

- కలెక్టర్ నారాయణ రెడ్డి



గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ, సెప్టెంబర్ 13 : కృషి ఉంటేనే లక్ష్య సాధన సులభమవుతుందని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉన్న కనగల్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆట స్థలం, హాస్టల్, తరగతి గదులు, కిచెన్ టాయిలెట్స్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకొన్నారు. పదో తరగతి విద్యార్థుల గదిలోకి వెళ్లి తెలుగు, ఇంగ్లిష్, సోషల్ సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఆ తర్వాత అన్ని సరుకులు సకాలంలో వస్తున్నాయా అని ప్రిన్సిపాల్ భిక్షమయ్యను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డైనింగ్, డార్మెటరీ, బాత్రూములను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రైవేటు భవనం అయినందున టాయిలెట్లకు ఇబ్బందిగా ఉందని ప్రిన్సిపాల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.



సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## హామీలను అమలు చేయలేకే దాడులు

- విధ్వంసకాండను ప్రోత్సహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులపై దాడులు చేస్తే సహించం
- బీఆర్ఎస్ నాయకుల మండిపాటు

సూర్యాపేట, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్బంధాలు, అణచివేతలతో ఇందిరాగాంధీ నాటి ఎమర్జెన్సీ రోజులను గుర్తుకుతెస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు విమర్శించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ ఆత్మకూర్.ఎస్ మండలాధ్యక్షుడు తూడి నర్సింహారావుతో కలిసి శుక్రవారం సూర్యాపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయలేక సీఎం రేవంత్‌రెడ్డి దాడులకు ఉసిగొలుపుతూ ప్రజలను పక్కదోవ పట్టించే కుటిల యత్నాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులపై దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధిలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపితే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి మరిచి విధ్వంసకాండకు పాల్పడుతూ అట్టడుగు స్థానానికి తీసుకెళ్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్‌లో గెలిచిన అరికెపూడి గాంధీని కాంగ్రెస్‌లో చేర్చుకొని నేడు తమ పార్టీలో లేడు బీఆర్ఎస్‌లోనే ఉన్నాడని బూటకపు మాటలు మాట్లాడుతుండడం సిగ్గు చేటన్నారు. మొన్న ఖమ్మంలో వరద ముంపు బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డిపై దాడులు చేసి రౌడీ రాజకీయాన్ని ప్రదర్శించారని మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయం మీద, తుంగతుర్తిలో రైతుసమస్యలపై ధర్నా చేస్తున్న నాయకులపై దాడులు చేయడం చూస్తుంటే కాంగ్రెస్ హామీలను పక్కదోవ పట్టించేందుకు ఆడుతున్న నాటకాలు స్పష్టమవుతున్నారన్నారు. ఏం తప్పు చేశారని గ్రామగ్రామాన బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్నారో పోలీసులు సమాధానం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఫ్రెండ్లీ పోలీస్‌గా కొనసాగితే.. నేడు కాంగ్రెస్ పాలనలో పోలీసులను అడ్డం పెట్టుకొని దుర్మార్గాలు చేస్తూ బీఆర్ఎస్ లక్ష్యంగా దాడులు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి దాడులను తెలంగాణ ప్రజానీకం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్లు ఎస్కే తాహేర్‌పాషా, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఆకుల లవకుశ, బత్తుల జానీ, ప్రసాద్, ముదిరెడ్డి అనిల్‌రెడ్డి, బుడిగ నవీన్, జానకిరాములు, మురళి పాల్గొన్నారు.

## వరదలకు 22,409 ఎకరాల్లో పంట నష్టం

- 39 ఇండ్లు పాక్షికంగా, పూర్తిగా ధ్వంసం
- ఇద్దరు మృతి.. చనిపోయిన 154 పశువులు, గొర్రెలు, కోళ్లు
- 231 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రోడ్లు
- శాఖల వారీగా నష్టం అంచనా తయారు.. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక




వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, సెప్టెంబర్ 13 : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో జరిగిన నష్టంపై ఎస్‌బీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం పలు శాఖలు రూపొందించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. కోదాడ మున్సిపాలిటీలో వరదకు కొట్టుకుపోయి యర్రమళ్ల వెంకటేశ్వర్లు, నాగం మురళీకృష్ణ మరణించారని, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ. 5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందశామని పేర్కొన్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా 4 ఎద్దులు, 20 బర్రెలు, 3 ఆవులు, 22 గొర్రెలు, మేకలు, 105 కోళ్లు చనిపోయాయని, వాటికి నష్ట పరిహారం కింద రూ.13.085 లక్షలు అంచనా వేసినట్టు తెలిపారు. హౌసింగ్ శాఖ ద్వారా వరదల వల్ల 7 కచ్చా ఇండ్లు కూలాయని 2 పక్కా ఇండ్లు, 2 కచ్చా ఇండ్లు తీవ్రంగా దెబ్బ తిన్నాయని, 28 ఇండ్ల పైకప్పులు, గోడలు కూలాయని, 4,910 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని.. ఇంటికి రూ .16,500 చొప్పున రూ.8.16కోట్ల నష్ట పరిహారం అంచనా వేశామని వివరించారు. మత్స్యశాఖ ద్వారా మూడు చెరువుల్లో 71టన్నుల చేపలు, 31 పడవలు వరదలో కొట్టుకుపోయాయని, వాటికి రూ.1.13కోట్ల నష్ట పరిహారం అంచనా వేశామని తెలిపారు. వ్యవసాయశాఖ ద్వారా 33శాతం కన్నా ఎక్కువ పంట నష్టం జరిగిన 9068.72 హెక్టార్లలో (22,409ఎకరాలు) రూ.14.43 కోట్ల పంట నష్టం అంచనా వేశామని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా 126రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు రూ. 7.21 కోట్లు.. 61 కల్వర్టులు, బ్రిడ్జిలు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతులకు రూ.36.6లక్షల నష్టం అంచనా వేసినట్టు వివరించారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా రాష్ట్ర రోడ్లు 231.90 కిలోమీటర్లు దెబ్బ తిన్నాయని, మరమ్మతులకు రూ.1.39 కోట్లు, గ్రామీణ రోడ్లు 7.10 కిలోమీటర్లు దెబ్బ తిన్నాయని, వాటి మరమ్మతులకు రూ.4.26లక్షలు అంచనా వేశామని తెలిపారు. 14 కల్వర్టులు, బ్రిడ్జిలు దెబ్బ తిన్నాయని, వాటి మరమ్మతులకు రూ.8.4లక్షలు.. మున్సిపాల్టీలో రూ.19.58 కిలోమీటర్ల రోడ్లు, 12 కల్వర్టులు, బ్రిడ్జిలు దెబ్బ తిన్నాయని, వాటి మరమ్మతులకు రూ.6.32 కోట్లు అంచనా వేశామని తెలిపారు. విద్యుత్‌శాఖ ద్వారా 4,461 కరెంట్ స్తంభాలకు రూ.2.23 కోట్లు, 140 కిలోమీటర్ల కండక్టర్ తీగకు రూ.70లక్షలు, 414 ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు రూ.1.80 కోట్లు అంచనా వేశామని పేర్కొన్నారు. విద్యాశాఖ ద్వారా వరదలతో 4 ప్రాథమిక పాఠశాలలు, 1 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 2 కేజీబీవీ పాఠశాలలు, 1 ఎమ్మార్సీ భవనం, 1 సోషల్ వెల్ఫేర్ హాస్టల్, 4 ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్ దెబ్బ తిన్నాయని, వాటి మరమ్మతులకు రూ.95.40 లక్షలు అంచనా వేసినట్లు వివరించారు. నీటి పారుదల శాఖ ద్వారా జిల్లాలో 40 మైనర్ ఇరిగేషన్ స్కీమ్‌లు, 13 మేజర్ ఇరిగేషన్ స్కీమ్‌లు దెబ్బ తిన్నాయని, వాటి మరమ్మతులకు రూ.24.30కోట్లు అంచనా వేసినట్టు తెలిపారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరా పథకం కింద 16 ప్రదేశాల్లో 2,420 మీటర్ల పైప్‌లైన్ మరమ్మతు చేసేందుకు రూ.1 కోటి, 2 ప్రదేశాల్లో 5 మోటార్లు మరమ్మతులకు రూ.14.5లక్షలు, అలాగే మున్సిపాల్టీల్లో 1,765 పైప్‌లైన్లు దెబ్బ తిన్నాయని, వాటికి రూ.26.27లక్షలు అంచనా వేశామని కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఓటర్లు 6,82,938

**సూర్యాపేట ఓటరు ముసాయిదా జాబితా విడుదల**




- పురుషుల ఓటర్ల కంటే 11,778 మంది స్త్రీలు అధికం
- 23మండలాలకు గాను 21 మండలాల్లో మహిళలే ఎక్కువ
- అత్యధికంగా గరిడేపల్లిలో 45,947 మంది ఓటర్లు
- అత్యల్పంగా తిరుమలగిరిలో 17.575 మంది
- నేటి నుంచి 21వరకు అభ్యంతరాల స్వీకరణ

సూర్యాపేట, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓటరు ముసాయిదా జాబితా విడుదలైంది. శుక్రవారం గ్రామ పంచాయతీల వారీగా జాబితాను రిలీజ్ చేశారు. గ్రామ పంచాయతీలు, ఎంపీడీఓ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో లిస్ట్‌ను ప్రదర్శించారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం 486 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 6,82,938 మంది ఓటర్లు ఉండగా, అందులో 3,35,570 మంది పురుషులు, 3,47,348మంది స్త్రీలు ఉన్నారు. పురుషుల కంటే 11,778 మంది స్త్రీలు అధికంగా ఉన్నట్లు లెక్కలు చెప్తున్నాయి. జిల్లాలో 23 మండలాలకుగాను తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల్లో పురుషులు స్వల్పంగా ఎక్కువ ఉండగా మిగిలిన 21 మండలాల్లో స్త్రీలదే అధిక్యం ఉంది. అనంతగిరి, గరిడేపల్లి, మద్దిరాల, మఠంపల్లి, మేళ్లచెరువు, మోతె, నడిగూడెం, నాగారం, సూర్యాపేటలో థర్డ్ జెండర్లు ఉన్నారు. అత్యధికంగా గరిడేపల్లి మండలంలో 45,947 మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా తిరుమలగిరి మండలంలో 17,575 మంది ఉన్నారు. ఓటరు జాబితాపై శనివారం ఉంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరించి.. ఈ నెల 26 వరకు పరిష్కరించనున్నారు.

### మండలాల వారీగా ఓటరు జాబితా..

| మండలం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| అనంతగిరి | 12,385 | 13,124 | 1 | 25,510 |
| ఆత్మకూర్.ఎస్ | 21,315 | 21,599 | 0 | 42,914 |
| చిలుకూరు | 15,682 | 16,668 | 0 | 32,350 |
| చింతలపాలెం | 12,966 | 13,514 | 0 | 26,480 |
| చివ్వెంల | 14,007 | 14,469 | 0 | 28,476 |
| గరిడేపల్లి | 22,247 | 23,693 | 7 | 45,947 |
| హుజూర్‌నగర్ | 10,099 | 10,511 | 0 | 20,610 |
| జాజిరెడ్డిగూడెం | 11,900 | 12,117 | 0 | 24,017 |
| కోదాడ | 15,239 | 16,139 | 0 | 31,378 |
| మద్దిరాల | 12,428 | 12,505 | 1 | 24,994 |
| మఠంపల్లి | 18,132 | 19,063 | 1 | 37,196 |
| మేళ్లచెర్వు | 16,494 | 17,269 | 1 | 33,764 |
| మోతె | 18,521 | 18,890 | 4 | 37,415 |
| మునగాల | 17,772 | 18,633 | 0 | 36,405 |
| నడిగూడెం | 11,971 | 12,283 | 1 | 24,255 |
| నాగారం | 11,942 | 12,163 | 3 | 24,108 |
| నేరేడుచర్ల | 10,588 | 11,217 | 0 | 21,805 |
| నూతనకల్ | 14,274 | 14,288 | 0 | 28,562 |
| పాలకవీడు | 10,150 | 10,875 | 0 | 21,025 |
| పెన్‌పహాడ్ | 16,302 | 17,018 | 0 | 33,320 |
| సూర్యాపేట | 15,383 | 15,619 | 1 | 31,003 |
| తిరుమలగిరి | 8,812 | 8,763 | 0 | 17,575 |
| తుంగతుర్తి | 16,961 | 16,868 | 0 | 33.829 |
| మొత్తం | 3,35,570 | 3,47,348 | 20 | 6,82,938 |

## నల్లగొండ జిల్లాలో ముసాయిదా ఫొటో ఓటరు జాబితా ప్రచురణ

నల్లగొండ, సెప్టెంబర్ 13 : నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 844 గ్రామ పంచాయతీలతోపాటు మండల పరిషత్ కార్యాలయాల్లో ఫొటో ఓటరు జాబితాను శుక్రవారం అధికారులు ప్రచురించారు. గ్రామ పంచాయతీ ఓటరు జాబితా తయారీలో భాగంగా వార్డు డివిజన్‌ను సూచిస్తూ రూపొందించిన ముసాయిదా ఫొటో ఓటరు జాబితాను కలెక్టర్ ఆదేశాల మేరకు విడుదల చేశారు. ఈ ముసాయిదా ఓటరు జాబితాపై ఈ నెల 18న జిల్లా స్థాయిలో ఎన్నికల అథారిటీ, 19న మండల స్థాయిలో ఎంపీడీఓల ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు. నేటి నుంచి ఈ నెల 21వరకు ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి ఈ నెల 26న వాటిని పరిష్కరించనున్నారు. 28న తుది ఫొటో ఓటరు జాబితాను జిల్లా పంచాయతీ అధికారి ద్వారా ప్రచురించనున్నారు.

ముసాయిదా ఓటరు జాబితాల సవరణపై 18న జిల్లా స్థాయిలో, 19న మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు ఏర్పాటు చేసి, వారి సూచనలు, సలహాలు తీసుకోనున్నారు. 28న తుది జాబితా విడుదల చేయనున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు.